లింగ నిర్ధారణ పరీక్షలు నేరం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ దాసి రాజు హెచ్చరించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది డివిజన్లోని స్కానింగ్ సెంటర్లలో దశలవారీగా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడిన వైద్యులకు చట్టప్రకారం మొదటి తప్పునకు మూడేళ్లు జైలుశిక్ష, రూ.50 వేల జరిమానాతోపాటు భారత వైద్య మండలి వద్ద వైద్యుల ధ్రువీకరణ పత్రం ఐదేళ్ల వరకూ తొలగిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ వి.ప్రసాద్, డాక్టర్ జెట్టి గణేష్‌బాబు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి, అల్లూరి నళినిదేవి, వై.విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

టిడ్కో.. ఇచ్చేదెన్నటికో..!

టిడిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ఆర్భాటంగా ప్రారంభించింది. అయితే ప్రారంభం ఘనంగా ఉన్నా అమలు మాత్రం ముందుకు సాగని పరిస్థితి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పలు చోట్ల భవనాలు పూర్తికపోవడంతో పేదలు అద్దె ఇళ్లల్లో మగ్గుతున్నారు. ఇప్పటికే గృహ ప్రవేశాలు చేసిన వారు సరైన మౌలిక వసతులు లేక అవస్థలు పడుతుంటే.. గృహ ప్రవేశాలు చేయని వారు వాటి కోసం ఎదురుచూస్తున్నారు..

- రెండు జిల్లాల్లో పలుచోట్ల ఇంకా పూర్తికాని గృహాలు
- అద్దె ఇళ్లల్లో మగ్గుతున్న పేదలు
- గృహ ప్రవేశాలు చేసిన చోట మౌలిక వసతుల కొరత
- పిచ్చిమొక్కలతో ఆ ప్రాంతం అధ్వానం
- లబ్ధిదారుల ఆవేదన

తాడేపల్లిగూడెంలో ఇలా..

జంగారెడ్డిగూడెం : అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లు, పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం శివారు ప్రాంతమైన ఎల్.అగ్రహారంలో 5,376 టిడ్కో గృహాలు మంజూరు కాగా వాటిలో 3,232 మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు. మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అవి పూర్తికాని పరిస్థితి నెలకొంది. అయితే ఇప్పటికే గృహ ప్రవేశాలు చేసిన వారు సరైన మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మురుగు నీరు బయటకు పోయేందుకు వీల్లేక చెత్తా చెదారంతో నిండిపోయిందని, మొదటి అంతస్తులో నీరు కిందకు వెళ్లక అనేక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు వాపోయారు. గతంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, జెసిబి సాయంతో డ్రెయినేజీ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారని తెలిపారు. అయితే తమకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే గృహాల చుట్టూ చెట్లు, పొదలు గుబురుగా మొలవడంతో పాములు సంచరిస్తున్నాయని, ఇటీవల పాము ఓ మేకను కాటేయడంతో మృతి చెందిందని తెలిపారు. ఈ ప్రాంతంలోనే చిన్నపిల్లలు ఆడుకుంటారని, ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉందని వాపోతున్నారు. గతంలో ఇక్కడ పార్క్ నిర్మిస్తామని పాలకులు హామీ ఇచ్చారని, అది నిర్మిస్తే కొంత వరకూ సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు కోరుతున్నారు. చెత్త తీసుకెళ్లడానికి పారిశుధ్య వాహనం వారానికి ఒకసారి వస్తుందని, అప్పటివరకు చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని, సంబంధిత అధికారులు, నాయకులు సమస్యలను పరిష్కరించాలని టిడ్కో గృహవాసులు కోరుతున్నారు.


పాలకొల్లు : టిడ్కో ఇళ్ల వద్ద మురుగునీరు ఇలా

టిడ్కో ఇళ్ల వద్ద సమస్యలు తిష్ట.. ★ ★ ★

పాలకొల్లు : పాలకొల్లులో టిడ్కో గృహాల నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచీ రాజకీయ పరిణామాల మధ్య ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద లక్ష జనాభా దాటిన పట్టణాలకే ఈ స్కీమ్ అమల్లో ఉండగా 2017లో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి పాలకొల్లులో టిడ్కో గృహాల నిర్మాణానికి అంకురార్పణ చేశారు. అయితే 2019 ఎన్నికల ముందు వరకూ 80 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎన్నికల ముందు 2 వేల మంది టిడిపి లబ్ధిదారులచే గృహ ప్రవేశం చేయించారు. తరువాత అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం లబ్ధిదారులకు పట్టా రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చింది. 2022లో మొదటి విడతగా 1,856 ఇళ్లు, 2024లో మరో 704 ఇళ్లు లబ్ధిదారులకు ఇచ్చింది. తర్వాత వైసిపి ప్రభుత్వం వచ్చాక అరబస్తా సిమెంట్ పనులు కూడా చేయని పరిస్థితి అని టిడిపి ఆరోపించింది.

నూజివీడు టౌన్ : టిడ్కో ఇళ్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

అయితే ఏడాది క్రితం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గృహాల వద్ద కనీస వసతుల కల్పనకు కృషి చేస్తోంది. మంత్రి నిమ్మల రామానాయుడు విద్యుత్ స్తంభాలు వేయించారు. మున్సిపల్ వాటర్ ట్యాంకర్లు పంపిస్తున్నారు. మురుగు పోయేలా కృషి చేస్తున్నారు. ప్రజలు కాలువ అవతలకు వెళ్లేందుకు రూ.రెండు కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టారు. ఇంకా 1500 గృహాలు లబ్ధిదారులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. మొత్తం 6,144 గృహాలకు కేవలం 2,560 గహాలు ఇచ్చారని మిగిలినవి ఇవ్వాలని లబ్ధిదారులు ఆందోళన చేస్తున్నారు. కొంతమంది తాము ఇంకా ఇళ్లల్లోకి రాకపోయినా బ్యాంకులకు వడ్డీలు కట్టాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఖాళీగా ఉన్న గృహాల వద్ద పేకాట, మద్యం తాగడం వంటివి అసాంఘిక కార్యకలాపాలకు యువత పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిడ్కో గృహాల వద్ద పాఠశాల ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు దూరం వెళ్లాల్సి వస్తోందని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పట్టణం నుంచి గృహాల వద్దకు మంత్రి ఉచిత వ్యాన్ నడుపుతున్నారు. మిగిలిన ఇళ్లను అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

భవనాలకు మోక్షం ఎప్పుడు..!. ★ ★ ★

జంగారెడ్డిగూడెం : టిడ్కో ఇళ్లు తమకు ఎప్పుడు పూర్తిచేసి అందిస్తారని లబ్ధిదారులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇళ్లు మాత్రం అప్పగించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని మార్కండేయపురం దగ్గరలో 2014లో పేదల కోసం టిడ్కో గృహ నిర్మాణాలు ప్రారంభించారు. అయితే ఇప్పటికీ పూర్తిస్థాయిలో పనులు జరగని పరిస్థితి నెలకొంది. అప్పటి నుంచి ఆ భవనాల పరిస్థితి అలాగే ఉంది. భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వంలోనూ వాటిని పట్టించుకోని పరిస్థితి. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా భవనాలకు మోక్షం లభిస్తుందా, పేదలకు అందిస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తిచేసి ఇళ్లు లేని నిరుపేదలకు అందించాలని అధికారులను, ప్రభుత్వాన్ని ప్రజలు వేడుకుంటున్నారు.

ఏడేళ్లయినా ఊసే లేదు.. ★ ★ ★

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో 2014లో ఏర్పడిన టిడిపి ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ఆర్భాటంగా జి ప్లస్ త్రీ విధానంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఆనాటి పాలన ముగింపు దశలో ఈ నిర్మాణాలు ప్రారంభించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2019లో వైసిపి అధికారంలోకి వచ్చింది. జగన్మోహన్ రెడ్డి సిఎంగా అధికారం చేపట్టిన తర్వాత ఒక్క గుడివాడ తప్ప ఎక్కడా టిడ్కో గృహ నిర్మాణాలపై దృష్టి సారించని పరిస్థితి నెలకొంది. నూజివీడు పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాంతంలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి విషసర్పాలకు నిలయంగా మారింది.

నూజివీడు పట్టణ పరిధిలో డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలనీలో టిడ్కో గృహ నిర్మాణాలు జిప్లస్‌త్రి విధానంలో చేపట్టారు. ఈ నిర్మాణాల్లో 300 ఎస్ఎఫ్‌టి కేటగిరిలో 864 మంది, 365 ఎస్ఎఫ్‌టి కేటగిరిలో 864 మంది, 430 ఎస్ ఎఫ్‌టిలో 912 మంది మొత్తం 2640 మందికి గృహాలు మంజూరయ్యాయి. 300 ఎస్ఎఫ్‌టి కేటగిరిలో 849 మంది రూ.500 చొప్పున, 365 ఎస్ఎఫ్‌టి కేటగిరిలో 517 మంది రూ.50 వేలు చొప్పున, 430 ఎస్ఎఫ్‌టి కేటగిరీలో 897 మంది రూ.లక్ష చొప్పున మొత్తం 6.91,74,278 డిపాజిట్లుగా లబ్ధిదారులు చెల్లించారు. లబ్ధిదారులు డిపాజిట్ చెల్లించి ఈ ఏడాదికి ఏడేళ్లు నిండాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి టిడ్కో గృహ నిర్మాణాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాల ఊసే లేదంటే అర్థం చేసుకోవచ్చు.

సునామీ వార్తలతో ఉలికిపాటు

నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న తీరప్రాంత వాసులు

ప్రజాశక్తి - మొగల్తూరు

రష్యా తీరంలో భూకంపం ఫలితంగా పలు దేశాలకు సునామీ హెచ్చరికలు రావడంతో జిల్లాలోని తీరప్రాంత ప్రజలు ఉలిక్కిపడ్డారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఒకింత ఆందోళనగానే గడిపారు. ఎక్కడ చూసినా సునామీ హెచ్చరికలతోపాటు 2004 సెప్టెంబర్ 26న విరుచుకుపడిన సునామీ కారణంగా నరసాపురం, మొగల్తూరు మండలాల్లో చోటుచేసుకున్న ప్రాణ, ఆస్తి నష్టంపై చర్చించుకోవడం కన్పించింది. అయితే బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నరసాపురం, మొగల్తూరు మండలాల పరిధిలో సముద్రపు కెరటాలు సాధారణంగానే ఉన్నాయని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. ఇటీవల అల్ప పీడనం ప్రభావంతో వారం రోజులపాటు సముద్రపు కెరటాలు ఎగసిపడ్డాయని, ప్రస్తుతం అంతా ప్రశాంతంగానే ఉందని చెప్పారు. దీంతో జనమంతా ఊపిరి పీల్చుకున్నారు.


పేరుపాలెం బీచ్‌లో ప్రశాంతంగా ఉన్న సముద్రం

నిత్యావసరాలు సరసమైన ధరలకు అందించాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

నిత్యావసర సరుకులు సరసమైన ధరలకు అందించి మార్కెట్లో ధరలు పెరగకుండా సహకరించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్, కూరగాయలు, వర్తక సంఘాల సభ్యులతో నిత్యావసర సరుకులు నియంత్రణపై ఆయన సమీక్షించారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు, సరసమైన ధరలకు అందించి మార్కెట్లో ధరలు పెరగకుండా వర్తకులు సహకరించాలన్నారు. బియ్యం, పప్పులు, ఆయిల్ వంటి సరుకులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. జిల్లాలో పూర్తిగా ప్లాస్టిక్ నియంత్రణకు కిరాణా, కూరగాయల దుకాణదారులెవ్వరూ ప్లాస్టిక్ వాడకుండా సహకరించాలని, వినియోగదారులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో డిఎస్ఒ ఎన్.సరోజ, జిల్లా మార్కెటింగ్ ఎడి ఎం.సునీల్‌కుమార్, భీమవరం రైతుబజార్ ఎస్టేట్ అధికారి కళ్యాణ్, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లు, ఆకివీడు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, వర్తక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

పేదలకు ఆర్థిక చేయూతనివ్వాలి

భీమవరం: పి-4లో భాగంగా సంపన్నులు పేద ప్రజలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు ముందుకు రావాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైస్‌మిల్లర్స్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన పి-4లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మార్గదర్శకులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి చేయూతనిస్తే వారు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. పి-4లో భాగంగా రైస్‌మిల్లర్లు, సంపన్న రైతులు మార్గదర్శకులుగా రిజిస్టర్ చేసుకుని, బంగారు కుటుంబాలుగా అర్హులైన పేదలను దత్తత తీసుకోవాలని కోరారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు మాట్లాడుతూ తమ అసోసియేషన్ తరపున పేద పిల్లల ఉన్నత చదువులకు, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని, వారి పురోభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సిపిఒ కంటిపూడి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఎమ్‌డి.ఇబ్రహీం, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.సరోజ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: పి-4 అవసరాల అంచనా సర్వేను జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. స్థానిక 16వ వార్డులో బుధవారం ఆయన సర్వేను పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా వార్డులో పి-4 అవగాహనా సభ ఏర్పాటు చేశారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. పి-4 యాప్ ద్వారా అర్హులైన బంగారు కుటుంబాల వివరాలు పరిశీలించారు. అందుబాటులో ఉన్న రెండు బంగారు కుటుంబాల సభ్యులను కలిసి వారి ఆర్థిక పరిస్థితి, పిల్లల చదువులు, ఆరోగ్య పరిస్థితులు, వారు కోరుకుంటున్న అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఇన్‌ఛార్జి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్‌డిఒను ఆదేశించారు. ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, వార్డు పరిపాలనా కార్యదర్శి సిహెచ్.మోహన్‌కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల భారంతో ప్రజలు విలవిల

అదానీతో ఒప్పందం రద్దు చేసే వరకు ఆందోళన - ప్రచార యాత్రలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు జెఎన్‌వి.గోపాలన్

భీమవరం: మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

స్మార్ట్ మీటర్ల భారంతో ప్రజలు విలవిల్లాడుతున్నారని, అదానీతో చేసుకున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేసేంత వరకూ ఆందోళన కొనసాగిస్తామని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే దుష్ప్రభావంపై ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ప్రచార యాత్ర నిర్వహించారు. ప్రకాశం చౌక్, కెఎల్‌ఎం రోడ్డు, మావుళ్లమ్మ గుడి వీధిలో ఇంటింటా ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజాక్షేత్రంలోకి తీసుకుకెళ్తామన్నారు. స్మార్ట్ ఒప్పందాలను రద్దు చేసి ప్రజలపై భారాలు తగ్గించే వరకూ ఆందోళన చేస్తామన్నారు. ఇప్పటికే వివిధ రకాల విద్యుత్ ఛార్జీలను ప్రజలపై మోపి ప్రజలను పీడిస్తున్న ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో తట్టుకోలేని భారాలను ప్రజలపై మోపాలని చూస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన నేటి పాలకులు వాటిని రద్దు చేయకుండా ప్రజలకు బలవంతన అంటగట్టాలని చూస్తున్నారన్నారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు సిహెచ్.రంగారావు మాట్లాడుతూ ఆగస్టు రెండో తేదీన ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సదస్సు నిర్వహిస్తున్నామని, ఐదో తేదీన విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన చేపడతామన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు మహంకాళరావు, బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డేగల నాగేశ్వరరావు, గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో కరపత్రాల పంపిణీ

తాడేపల్లిగూడెం: ప్రమాదకర అదానీ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పదో రోజు పట్టణంలోని మహాలక్ష్మీ నగర్, కర్రి సత్యవతి నగర్, సెటిల్ రోడ్డులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు విద్యుత్ పంపిణీ ప్రయివేటీకరణకు, కార్పొరేట్లకు కట్టబెట్టేందుకేనని అన్నారు. వీటికి వ్యతిరేకంగా ఆగస్టు ఐదో తేదీన చేపట్టే ధర్నాలో పట్టణ ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, తోట శ్రీను, కన్నంరెడ్డి శివాజీ, నగిరెడ్డి సాయి, విశంశెట్టి అప్పారావు, పకుర్తి చిన అప్పారావు, కొమ్మిరెడ్డి ఉదయ్‌కుమార్, నాగలపల్లి యేసు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం ఆధ్వర్యాన బుధవారం మూడో రోజు నిరసన కొనసాగించారు. ఆ పార్టీ మండల కన్వీనర్ సిరపరపు రంగారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల విధానాన్ని తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బర్ల బాలాజీ, దత్తు రాము, తెర్లి రాజేష్, బుద్దాల అర్జున్, జక్కంపూడి బాలాజీ, కవ్వల బాలాజీ, బుద్దాల నాని పాల్గొన్నారు.

శ్రమదానంతో అల్లూరి హాలు శుభ్రం

సహకరించిన మున్సిపల్ సిబ్బంది

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ పున్ణనిర్మాణ ప్రాంగణాన్ని బుధవారం భీమవరం పురపాలక సంఘం సహకారంతో శ్రమదానం చేసి శుభ్రం చేశారు. సాధన కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ సాధన కమిటీ అభ్యర్థన మేరకు భీమవరం పురపాలక సంఘం హాలు ప్రాంగణాన్ని శుభ్రం చేయించిందని, మున్సిపల్ సిబ్బందితోపాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కూడా సహకారం అందించారని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉండే ఈ అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్‌ను పున్ణ నిర్మాణం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ హాల్ నిర్మాణానికి దాతలు కూడా ముందుకు రావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రమదానం చేస్తున్న సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

డివైఇఒ, ఎంఇఒ-1లుగా

ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకం తగదు

ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం

ప్రజాశక్తి - వీరవాసరం

రాష్ట్రంలో 97 శాతం ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను కాదని, మూడు శాతం కూడా లేని ప్రభుత్వ ఉపాధ్యాయులకు డివైఇఒ, ఎంఇఒ-1 తదితర పోస్టులు కట్టబెట్టడం తగదని ఎపి ప్రధానోపాధ్యాయ సంఘం ఖండించింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్‌వి.రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎన్.శ్రీమన్నారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు జివి.శ్రీనివాస్, జిల్లా కోశాధికారి బండి ఆంజనేయులు, ఎంఇఒ-2లు జి.జాన్‌ప్రభాకర్, పి.రామకృష్ణ, బి.వినాయకుడు ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయ స్థానం యథాతథ స్థితి కొనసాగించాలని చెప్పినప్పటికీ ఏకపక్షంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు అనుకూలంగా వ్యవహరించడం అన్యాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఇఒ-1 పోస్టులను ఎఫ్ఎసిలుగా ప్రభుత్వ యాజమాన్యంలోని హెచ్‌ఎంలతో మాత్రమే కాకుండా స్కూల్ అసిస్టెంట్‌లతో కూడా భర్తీ చేయడానికి పూనుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. జిఒ 154 ప్రకారం ఎంఇఒ-1 పోస్టులు 13 మాత్రమే అయినప్పటికీ మిగిలిన 666 పోస్టులను ఎంఇఒ-1లుగా పరిగణిస్తూ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను పరిగణనలోకి తీసుకోకుండా జూనియర్లు ఐన ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్లకు కట్టబెట్టాలని చూడటం సర్వీస్ రూల్స్‌కు గండికొట్టడమేనని పేర్కొన్నారు. దీనివల్ల నష్టపోతుంది పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులతోపాటు దీర్ఘకాలంలో 97 శాతం పంచాయితీరాజ్ ఉపాధ్యాయులులేనని తెలిపారు. వాస్తవానికి 1998 వరకూ ఎపిపిఎస్‌సి ద్వారా నియమితులైన వారు మాత్రమే ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పరిగణించబడతారని, అయితే డిఎస్‌సి ద్వారా నియమితులైనటువంటి వారిని కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పరిగణిస్తూ జూనియర్లు అయిన వారిని కూడా ఎంఇఒ-1లుగా నియమించాలని చూడడం సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకమని, తక్షణమే ఈ చర్యలు ఆపి పంచాయితీరాజ్ హెచ్‌ఎం, ఎంఇఒలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సంపాదిత సెలవు బకాయిలు చెల్లించాలి

ఎస్‌టియు జిల్లా ప్రధానకార్యదర్శి సాయివర్మ

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయులు ప్రతియేటా పెట్టుకునే సంపాదిత సెలవు నగదు చెల్లించాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పిపిఆర్‌విఎస్.సాయివర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినప్పటికీ ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కూడా అదే ధోరణి ప్రదర్శిస్తూ ఇప్పటి వరకూ సెలవు నగదుగా పెట్టుకున్న వారికి చెల్లించలేదని విమర్శించారు. సమస్యను అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కనీసం పట్టించుకోవట్లేదని తెలిపారు. ఉపాధ్యాయుల నగదుగా మార్చుకున్న సంపాదిత సెలవు ఉద్యోగస్తులు, ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లలో నమోదు చేయడం కూడా పూర్తి చేశారని, దీనికి సంబంధించిన డబ్బు మాత్రం ఇప్పటికీ ఉద్యోగస్తులు, ఉపాధ్యాయుల బ్యాంకు ఖాతాలకు 2022 నుండి జమ కాలేదని తెలిపారు. ఇప్పటికైనా పెండింగులో ఉన్న బకాయిలన్నిటినీ ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రసాభాసగా నరసాపురం కౌన్సిల్ సమావేశం

చెత్త సేకరణ, మార్కెట్ పాటపై నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలుతుందని, ప్రజాధనాన్ని అధికారులు ఇష్టానుసారం దోచేస్తున్నారని ఐదో వార్డు కాన్సిలర్ వన్నెంరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. ఛైర్‌పర్సన్ పోడియం వద్ద ఆయన ఆందోళన చేసి, అధికారులతో వాగ్వివాదానికి దిగారు. గత కౌన్సిల్ సమావేశంలో మార్కెట్ పాట తక్కువ మొత్తానికి గుత్తేదారునికి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తే డీసెంట్ ఇచ్చామని, కనీసం మినిట్స్ బుక్‌లోనూ ఎంటర్ చేయలేదని, ఇదెక్కడి దారుణమని, కౌన్సిలర్లు అంటే గౌరవం ఉందా అంటూ వైస్ ఛైర్‌పర్సన్ కామన నాగిని, కౌన్సిలర్ కావలి రామసీత ఛైర్‌పర్సన్ పోడియం వద్దకు చేరుకుని కమిషనర్‌తో వాగ్వివాదానికి దిగారు. కొన్ని రోజులుగా పట్టణంలో హోటళ్ల నుంచి చెత్త సేకరించకుండా కమిషనర్ అంజయ్య వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కౌన్సిలర్లు ఆక్షేపించారు. కమిషనర్ ఏకపక్ష ధోరణి మానుకోవాలని మండిపడ్డారు. సమావేశం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా ఛైర్‌పర్సన్‌తోపాటు కమిషనర్ కూడా 12.30 గంటలకు హాల్లోకి వచ్చారు. దీనిపై వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని, సభ్యులు వన్నెంరెడ్డి, బొంతు రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండాలో రూ.5 లక్షలతో మున్సిపల్ స్థలాల్లో స్తంభాలు పాతుతామనే అంశాన్ని చేర్చడంపై వన్నెంరెడ్డి మండిపడ్డారు. అసలు మున్సిపల్ స్థలాలు ఎక్కడున్నాయో చెప్పమంటే చెప్పడం లేదని, ఇప్పుడు ఎక్కడున్నాయో తెలియని స్థలాల్లో స్తంభాలు పాతుతారా అంటూ ప్రశ్నించారు. మున్సిపాల్టీలో చాలా పనులు చేసినట్టు బిల్లులు చేసుకుని ప్రజాధనం దోచుకుంటున్నారని అన్నారు. హోటళ్లలో చెత్త తీసుకోబోమని, చెత్త డంపింగ్ కోసం వ్యాపారులే స్థలాలు కొనుక్కోవాలని కమిషనర్ వింత ఆంక్షలు పెట్టడం ఏమిటని కౌన్సిలర్ షేక్ యాకూబీబీ, వన్నెంరెడ్డి శ్రీను నిలదీశారు.


కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

ఏలూరుపాడు హైస్కూల్‌కు లాప్ టాప్, కంప్యూటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థులు విద్యనభ్యసించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత స్థాయికి చేరిన తర్వాత చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలని ఏలూరుపాడు హైస్కూల్ పూర్వపు విద్యార్థులు పేర్కొన్నారు. ఏలూరుపాడు హైస్కూల్‌కు పూర్వపు విద్యార్థులు బుధవారం కంప్యూటర్ అందజేశారు. ఏలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-1994 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లక్ష రూపాయల విలువైన లాప్ టాప్, కంప్యూటర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జివి.సత్యనారాయణరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 31వ తేదీ గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి పెనుమంట్ర హైస్కూల్ ఎదురుగా ఉన్న లూథరన్ చర్చి ఆవరణలో ఎస్ఆర్.దాట్ల వర్ధంతి సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సిపిఎం నాయకులు కోడి శ్రీనివాస్‌ప్రసాద్, కె.సుబ్బరాజు తెలిపారు. ఉదయం బ్రాహ్మణ చెరువు సెంటర్ నుండి పెనుమంట్ర స్వాపం వరకూ ర్యాలీ జరుగుతుందన్నారు.

ఆలోచింపజేసిన 'బుద్ధుడితో నా ప్రయాణం' నాటకం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బుద్ధుడితో నా ప్రయాణం నాటక ప్రదర్శన ఆలోచింపజేసింది. ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి భీమవరం డిఎన్ఆర్ కళాశాలలోని రామకృష్ణ భవన్‌లో 'బుద్ధుడితో నా ప్రయాణం' నృత్య రూప నాటకాన్ని ప్రదర్శించారు. అంబేద్కర్ రాసిన బుద్ధుడు ఆయన ధర్మం పుస్తకం ఆధారంగా రూపొందించిన నాటక ప్రదర్శన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు కుమారుడు సుందర్ రాజు నాటక ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. వర్తమాన సమాజానికి గౌతమ బుద్ధుని బోధనల అవసరం ఉందన్నారు. ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నేషనల్ ట్రస్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎలిచర్ల హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనా జోసెఫ్ మాట్లాడుతూ ఈ నాటకం ఒక కళాత్మక ప్రదర్శన మాత్రమే కాదని, మానవజాతికి మార్గదర్శకంగా నిలిచే ధర్మబోధనల తాత్విక అభివ్యక్తి, నాటకరంగంలోకి బౌద్ధ ధర్మాన్ని సజీవంగా తీసుకువచ్చిన ఒక ప్రయోగమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్, జనరల్ సెక్రటరీ కొల్లి శ్రీనివాస్, గంట సుందర్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఇ మహేష్, ఎ.వీరయ్య, ఎం శ్రీకర్, కమలాకర్, సత్యవేణి, ఎస్తేర్ రాణి, మేరీ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ బ్యాగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డ లేదా నార సంచులు వాడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు అన్నారు. ప్లాస్టిక్ నిషేధ కమిటీ, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం బార్డోలి హైస్కూల్ విద్యార్థులతో భీమవరం బ్యాంక్ కాలనీలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల భూమి, నీరు, గాలి, కాలుషితం అవుతున్నాయన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఛైర్మన్ ఎన్ రూపావాణి, పాస్ట్ ప్రెసిడెంట్ చీడే అమ్మజీ, క్లబ్ జిల్లా ఛైర్మన్ అరేటి రాణి, క్లబ్ ప్రాజెక్ట్ ఛైర్మన్ గంధం శ్రీదేవి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంపై ప్రభుత్వం విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు, ప్రచార భేరీలు తనిఖీలు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, శ్రీలక్ష్మి, రామ, నాగమణి, మున్సిపాల్టీ సెక్రటరీలు పాల్గొన్నారు.

బాలికలు జాగ్రత్తతో మెలగాలి

ప్రజాశక్తి - తణుకు

బాలికలు నిరంతరం జాగ్రత్తతో మెలగాలని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. బుధవారం స్థానిక సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహం వద్ద ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ కొన్ని ముఠాలు కొంత మంది ఆడపిల్లలను లక్ష్యంగా చేసుకుని వారి జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు. ఆశలు చూపించి మహిళలను, పిల్లలను అంగవికారులుగా చేస్తున్నారని అన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సదస్సులో న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, పోణంగి శ్రావణిసమీర, కామన మునిస్వామి, ఐ.కిరణ్మయి, పిజధనుంజయరావు, పారాలీగల్ వాలంటీర్ గంట అజోర్, కాకర్ల నాని పాల్గొన్నారు.

మొగల్తూరు : మనుషుల అక్రమ రవాణా ను నిరోధించడం అందరి బాధ్యత అని ఎపిఎం ప్రభుదాస్ అన్నారు. బుధవారం ప్రపంచ మనుషుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ వెలుగు కార్యాలయ సిబ్బంది అవగాహనా ప్రదర్శన చేశారు. ప్రభుదాస్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా జరగడం దారుణం అన్నారు. ప్రతి రోజూ ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహనా కలిగి ఉండాలనిన్నారు. ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మహిళలను మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని తెలిపారు. ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ ఈ అక్రమ రవాణాకు లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా పద్మ శ్రీ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిషు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 29,200 మంది మహిళలను కాపాడి వారికీ పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. సిడిపిఒ ఊర్మిళ మాట్లాడారు. ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ అనిల్ కుమార్, చెన్న కేశవులు, ఐసిడిఎస్ వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం:గణపవరం డిగ్రీ కాలేజీలో బుధవారం మానవ అక్రమ నిరోదక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించి మాట్లాడారు. మానవ అక్రమ రవాణా పెద్ద సమస్యగా ఉందన్నారు. అక్రమ రవాణా విషయంలో విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, అధ్యాపకులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

శివారు పొలాలకు అందని సాగునీరు

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

పెనుగొండ మండలం ఇలపర్రులో సాగునీరందక వరి పొలాలు ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ పొలాలు ముంపు బారిన పడటం గమనార్హం. ముంపు నీరు తగ్గాక కాస్తున్న ఎండలతో నాట్లు ఎండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇలపర్రు కాల్వలో సాగునీరు సక్రమంగా అందకపోవడం దీనికి ప్రధాన కారణమని చెబుతున్నారు. పితానివారిపాలెం మురుగు కాలువ సమీపంలో కాలువలో పెరిగిపోయిన చెత్త వల్ల సాగునీరు అందని పరిస్థితి. సంబంధిత అధికారులు చెత్తను తొలగించి సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సర్పంచి, ఉప సర్పంచి వ్యాఖ్యలు అవాస్తవం

ఎంపిటిసి కొల్లేపర శ్రీనివాసరావు

ప్రజాశక్తి - వీరవాసరం

ఉపాధి హామీ చట్టంలో అవకతవకలు జరిగాయని, దానిలో తమ కుటుంబ సభ్యులు ఉన్నారంటూ చింతలకోటిగరువు సర్పంచి, ఉపసర్పంచి దాసరి మహాలక్ష్మి, మాణిక్యం చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని టిడిపి మండల అధ్యక్షులు, ఎంపిటిసి కొల్లేపర శ్రీనివాసరావు తెలిపారు. ఆయన చింతలకోటిగరువులోని తన స్వగృహంలో బుధవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉపాధి హామీ చట్టంలో తన కుటుంబ సభ్యులు ఉన్నారంటూ చెప్పిన సర్పంచి, ఉపసర్పంచులు వారి కుటుంబ సభ్యులున్నారన్న విషయం కనబడలేదా అని ప్రశ్నించారు. మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి సంబంధించిన ఉపాధి డబ్బులు తన తండ్రి పేరున పడితే వాటిని అవకతవకలు జరిగినట్టు చూపించారన్నారు. చింతలకోటి గరువు పంచాయతీ సర్పంచి, ఉపసర్పంచులు లక్షల రూపాయల నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ శ్రీనివాసరావు విమర్శించారు. వైసిపి పాలనలో తాము చెప్పినట్టు వినడంలేదంటూ సర్పంచి, ఉపసర్పంచి ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ పనులు ముందుకు సాగకపోవడంతో మరో మేట్‌ను నియమించడం జరిగిందన్నారు. సర్పంచి, ఉపసర్పంచి ఉపాధి పనులకు తీర్మానాలు ఇవ్వలేదన్నారు. ఈ విషయం ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లి ఉపాధి హామీ చట్టం ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామ సభలో తీర్మానాలు చేసి కూలీలకు ఉపాధి కల్పించామన్నారు. ఇది జీర్ణించుకోలేని వారు తన కుటుంబ సభ్యులు ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడినట్లు దుష్ప్రచారం చేశారన్నారు. ఈ విషయమై మండల అధికారులు దర్యాప్తు చేశారని సర్పంచి, ఉపసర్పంచులు చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని నిరూపితమవ్వడంతో కోర్ట్‌కి చేశారని తెలిపారు. ఉపాధి పనుల అవకతవకల్లో తాను లేనంటూ ఎంఎల్ఎకు చెప్పినా తనను విశ్వసించలేదని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గత దశల్లో కనిపించని ఇరికించి మాధవపురుషోత్తం టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అతను వైసిపి నాయకులతో చేతులు కలిపి కూటమిలో విభేదాలకు కారణమవుతున్నాడని తెలిపారు. సర్పంచి, ఉపసర్పంచులను తప్పుదోవ పట్టించడంలో మాధవపురుషోత్తం పాత్రతో పాటు మండల కూటమి నాయకులు కూడా ఉన్నారన్నారు. ఈ విషయమై పార్టీలో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఇరికింటి సాయిబాబు, తాతయ్యనాయుడు, పంజా సురేంద్ర, పంజా శ్రీనివాసరావు, కె.నర్సింహారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొల్లేపర శ్రీనివాసరావు

సేవాతత్పరుడు త్రిమూర్తులు

ఘనంగా త్రిమూర్తులు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం

సేవాతత్పరుడు, స్నేహశీలి గంటా త్రిమూర్తులు అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. టిడిపి బిసి సాధికారిత కమిటీ డైరెక్టర్, కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంటా త్రిమూర్తులు పుట్టినరోజు వేడుకలను బుధవారం టిడిపి ఆధ్వర్యంలో మిత్ర బృంద సభ్యులతో వారి స్వగృహంలో నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి శాలువా కప్పి ఆయనను సత్కరించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణి చేశారు. కార్యక్రమంలో టిడపి పట్టణ అధ్యక్షులు మద్దుల రాము, మైలాబత్తుల ఐజాక్ బాబు, పట్టణ జాయింట్ సెక్రటరీ యలమంచిలి శ్రీనివాసరావు, తిప్ప బాలముత్యం పాల్గొన్నారు.

త్రిమూర్తులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టిడిపి నాయకులు

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం గణపవరం, వెలగపల్లి గ్రామాల్లోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు సేవలందించడంతో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు కావాల్సిన నోటుపుస్తకాలు తోపాటు పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు ఈ కార్యక్రమంలో కోశాధికారి కెఎస్ఎన్.మూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిపిఐ మండల కార్యదర్శిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - గణపవరం

సిపిఐ గణపవరం మండల కార్యదర్శిగా పెనగంటి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా తాడేల వాసు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తెలిపారు. స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో జరిగిన పార్టీ నాలుగుగో మహాసభలో బుధవారం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగస్టు 19, 20వ తేదీల్లో సిపిఐ జిల్లా మహసభలు తణుకులో జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా నాయకులు ఎం.సీతారామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

గుర్రపుడెక్క ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేయాలి

ఆచంట:గుర్రపుడెక్క ద్వారా వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీకి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వర్మీ కంపోస్ట్ ఎరువులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో బోదెలు, కాలువల్లో ప్రవాహానికి అడ్డుగా ఉండే గుర్రపు డెక్కను ఉపాధి హామీ కార్మికులతో వెలికి తీయించి అనంతరం ఎండిన గుర్రపు డెక్కను చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి పంచాయతీ ద్వారా తరలించి అక్కడ డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగ పడేలా వర్మీ కంపోస్ట్ ఎరువు తయారుకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ఆదేశించారు. డిప్యూటీ ఎంపిడిఒ కె.బులి సూరన్న, ఎపిఎం.పెద్దిరాజు, ఎపిఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

2న అన్నదాత సుఖీభవ అమలు

పెనుగొండ :అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం కింద రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.20 వేలు పెట్టుబడి సాయంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుందని పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి.స్పందన తెలిపారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఇప్పటికే ఈ పథకానికి అర్హులైన రైతు కుటుంబాల జాబితా ప్రతి రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ పథకం కింద రూ.2000, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5000 మొత్తం కలిపి మొదటి విడతలో రూ.7000 రైతుల ఖాతాల్లో జమకానున్నాయని అన్నారు. అదేవిధంగా మండలంలో 139 మంది రైతుల బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పిసిఐ లింక్ లేకపోవడం, ఇనాక్టివ్‌గా ఉన్నాయని ఈ జాబితా కూడా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని, వీరు త్వరితగతిన తమ బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పిసిఐ లింక్ అనుసంధానం చేసుకోవాలని ఎఒ కోరారు. రైతులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో సెమినార్

ప్రజాశక్తి - నరసాపురం

స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల 'అంతరిక్ష సాంకేతికత, వ్యవస్థాపకత్వానికి అనువర్తన అవకాశాలు' అనే అంశంపై ప్రత్యేక సెమినార్ బుధవారం నిర్వహించారు. సెమినార్‌కు ఇస్రో శాస్త్రవేత్త వైవిఎన్.కృష్ణమూర్తి ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సు ద్వారా తక్కువ ఖర్చుతో కూడిన పౌర వినియోగ పరికరాల అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందన్నారు. అంతేకాకుండా, విజ్ఞాన పరిశోధనల కోసం అవకాశాలు కూడా విద్యార్థులు, అధ్యాపకులకు ఈ మాధ్యమంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ ఎస్.సురేష్ కుమార్, కె.కిరణ్మయి, వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపిచంద్ పాల్గొన్నారు.

దిగమర్రు సొసైటీ ఛైర్మన్‌గా సందీప్‌కుమార్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

దిగమర్రు సొసైటీ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న సందీప్ కుమార్

దిగమర్రు సొసైటీ ఛైర్మన్‌గా కవురు సందీప్ కుమార్, సభ్యులుగా రాపాక డేవిడ్‌రాజ్, పెచ్చెట్టి సత్యనారాయణ బుధవారం ప్రమాణ స్వీకారంచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో సందీప్‌కు సొసైటీ బాధ్యతలను మంత్రి నిమ్మల రామానాయుడు అప్పగించారని తెలిపారు. చిత్తశుద్ధితో పనిచేసి రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించి వారికి తోడ్పాటుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రాపాక కరుణాకర్, పాలకొల్లు మండల అధ్యక్షుడు పాముల రజినీకుమార్, కోడి విజయభాస్కర్, శ్రీరాములు, అయ్యప్ప నాయుడు, కె.గౌర్నాయుడు, రోజారమణి పాల్గొన్నారు.

నార్నిమెరక సొసైటీ అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సత్తి కొండ, సభ్యులు

నార్నిమెరక సొసైటీ అధ్యక్షునిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని నార్నిమెరక సొసైటీ అధ్యక్షునిగా జనసేన సీనియర్ నాయకుడు డేగల సత్యనారాయణ (సత్తి కొండ) బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు యేడిది నారాయణరావు, పూరిల్ల మాణిక్యాలరావు సభ్యులుగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు టిడిపి మండల అధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సహకార సొసైటీల ద్వారా రైతులకు నూతన కమిటీ ద్వారా నిస్వార్థంగా సేవలందిస్తూ సొసైటీని అభివృద్ధిలో అగ్ర పథాన నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పీతల శ్రీనివాస్, ఉన్నమట్ల కబర్ది, బోనం చినబాబు, కొడవడి వరబాబు, ఉన్నమట్ల ప్రేమ్ కుమార్, ఆరిమిల్లి రామ శ్రీనివాస్, తాళ్ల నాగరాజు, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, చేగొండి రవిశంకర్, పెన్మత్స రామభద్రరాజు, అంబటి విజయ్ కుమార్, సొసైటీ సెక్రటరీ చవాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోపాలకృష్ణకు పలువురు నేతల నివాళి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మాజీ ఎఎంసి ఛైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ సేవలు ఎనలేనివని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం మల్లిపూడి గ్రామంలో గోపాలకృష్ణ భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట తనయుడు పితాని వెంకట సురేష్, మండల అధ్యక్షులు వి.బులి రామిరెడ్డి, జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట్ కార్తీక్, మాజీ ఎఎంసి ఛైర్మన్ నల్లిమిల్లి నర్సిరెడ్డి, గుడిమెట్ల సుందర్ రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

గోపాలకృష్ణకు ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్ నివాళి

గోపాలకృష్ణ మృతి బిసిలకు తీరని లోటు అని ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్ అన్నారు. బుధవారం గోపాలకృష్ణ భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట గుడిమెట్ల గంగాధర్ రెడ్డి, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి గురుప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి వీరవల్లి తాతాజీ ఉన్నారు.

పలు చోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సరిపల్లి, లిఖితపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అడబాల జ్యోషిల ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. సార్వాలో ఎకరాకు 78 కిలోల యూరియా 150 కిలోల సూపర్, 40 కిలోల పొటాష్ వాడాలని సూచించారు. యూరియా మూడు దఫాలుగా వేయాలని, ఆఖరి దమ్ములో మాత్రమే సూపర్ వేయాలని తెలిపారు. ఎంటియు 7029, 1318 రకాలకు యూరియా 60 కిలోలు సరిపోతుందని, అలాగే కాంప్లెక్స్ ఎరువులు దమ్ములో లేదా ఊడ్చిన వారం రోజుల వ్యవధిలో మాత్రమే వేయాలని సూచించారు. ఎఇఒ లక్ష్మీనారాయణ, విఎఎ విజయ్, రైతులు పాల్గొన్నారు.

పెనుగొండ రూరల్ : చెరుకువాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి స్పందన మాట్లాడారు. రైతులు ఎకరాకు 210 రూపాయలను ప్రీమియంగా చెల్లిస్తే రూ.42,000 వరకు బీమా పొందగలుగుతారని తెలిపారు. అకాల వర్షాలు, తుపాన్ల వల్ల పంట నష్టపోతే ఈ బీమా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పశు శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు, రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఉండి : ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల వంటి వాటి వల్ల కలిగిన పంట నష్టం నుంచి రైతులను రక్షించడానికి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ఇ పంట నమోదు ఉపయోగపడుతుందని మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎన్ఆర్‌పి అగ్రహారంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఆవశ్యకతను వ్యవసాయ అధికారి శ్రీనివాస్ వివరించారు. రైతులు కచ్చితంగా ఇ పంట నమోదు చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కార్యక్రమంలో భాగంగా ఎకరానికి 210 రూపాయలు ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి కరణం పరంజ్యోతి, గ్రామ వ్యవసాయ సహాయకులు రాంప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని వ్యవసాయ భూముల్లో 90 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని మండల ఇంఛార్జి వ్యవసాయ అధికారి బి.దేవీ స్వరూప తెలిపారు. బ్రాహ్మణ చెర్వులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఎఒ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సాగులో ఉందని అలాగే ఎక్కువగా రైతులు 1318 రకాన్ని సాగు చేశారని తెలిపారు. సార్వాలో రైతులు ఎక్కువగా రసాయనికి ఎరువులు వాడొద్దని, వరి చేను పెరుగుదలను బట్టి మాత్రమే ఎరువులు వినియోగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి

భీమవరం :విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్ఎ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భీమవరంలో శ్రీ గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడలిలో ఎం.రాజేష్ అధ్యక్షతన బుధవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అప్పలస్వామి మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు దాదాపు రూ.6,400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల పేద విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడే పరిస్థితి వచ్చిందన్నారు. తక్షణం బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎ నాయకులు పి.రామ్‌ప్రసాద్, డి.ప్రకాష్, కె.సాయి సుమంత్, టి.పార్థు పాల్గొన్నారు.

IN THE COURT OF THE M.A.C.T-CUM- 1st ADDL. CHIEF JUDGE:
CITY CIVIL COURT: AT SECUNDERABAD
O.P.No. 371 of 2024

Between :
Bojula Nagamani & others ...Petitioners
And
Peruri Manikanta & another ...Respondents

To,
1. Peruri Manikanta, S/o P Surya Prakash, Aged about: major,
Occ: Owner-cum-Rider of motor cycle Br.No TS-07-JT-3963,
R/o.H..No. 25-19-1/4, 26th division , Mallimoggala Vari Veedi,
Narsimharaopeta, Eluru, West Godavari dist, Andra Pradesh-534006.

NOTICE

Please take notice that in the above matter the Petitioner had filed case against you (Respondent No.1) for compensation, and the same is posted for your appearance on 22-08-2025.
You are advised to appear on 22-08-2025 at 10.30 a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided ex party.

(BY THE ORDER OF THE COURT)

E.BALA KRISHNA,
V. SHANTHI
M.SATHISH KUMAR
K.PRASHANTH
Advocates
H. No.5-12-186-/8,
Mangapuram,
H.B.Colony,
Moula Ali,
Hyderabad – 40
Counsel for Petitioner

'చంద్రబాబు మోసాలు ప్రజలకు చెప్పాలి'

ప్రజాశక్తి - ఆచంట

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, చంద్రబాబు చేసిన మోసాలను రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని జెడ్‌పి ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెంలోని వైసిపి కార్యాలయంలో మండల వైసిపి నాయకులు, కార్యకర్తల సమావేశం వైసిపి మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గంలో ఎస్‌సి, బిసి సర్పంచులపై ఎంక్వయిరీల పేరుతో బెదిరిస్తున్నా, రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. గత జగన్ పరిపాలనలో అన్ని వర్గాలకు నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తే, ఇప్పటి కూటమి ప్రభుత్వం పార్టీలు చూసుకుంటూ అర్హులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోట సరోజినీ, జక్కంశెట్టి శ్రీరామ్ వైసిపి నాయకులు కోట వెంకటేశ్వరరావు, కర్రి వేణుబాబు, నాగేశ్వరరావు, ప్రేమకుమార్ పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి - ఆకివీడు

నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం గురువారం ఉదయం జరుగుతుందని కమిషనర్ గుండు కృష్ణమోహన్ తెలిపారు. ఉదయం 10:30లకు మీటింగ్ హాల్లో ఈ సమావేశం జరుగుతుందన్నారు.

CHANGE OF NAME
I, KURAPATI DHARMASWAMY (Old name) Son of KURAPATI SHOBANADRA RAO , R/o Door.No. 2-41/1, Opposite Vetarnity Hospital, Pedavegi, West Godavari District, PIN-534475, have changed my name KURAPATI DHARMA SWAMY to KURAPATI DHARMA SOMA- LINGESWARA RAO (new name) same as intimated to The General Public

పాస్‌పోర్టు పోయింది
పట్టా పుష్పలత, భర్త, పట్టా ప్రసాద్, డోర్ నెంబర్ 45a -5-7a, రాజీవ్ నగర్, పాలకొల్లు రూరల్ పంచాయతీ, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను ది 20-11-2008లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి H1760526 నెంబర్ పాస్ పోర్ట్ పొంధియున్నాను. నేను ది 20-6-2025 న మా ఇంటి నుంచి పాలకొల్లు యడ్లబజార్ సెంటర్ లో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ తో జెరాక్స్ కాపీలు తీయించుటకు బైక్ పై వెళుతుండగా దారిలో పడి పోయినవి. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు అందజేయగలరు.
నా సెల్ నెంబర్ 8885262950

ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.P.No.10/2025
Between:
1.Smt.Narava Bhavani, W/o.Narava Naresh, House No.G-1, Flat No.C-70, L&T Housing Colony, Penkullapadu, Palakollu-534260, W.G.Dt., A.P.
2.Narava Naresh, S/o.Narava Suryanarayana, House No.G-1, Flat No.C-70, L&T Housing Colony, Penkullapadu, Palakollu-534260, W.G.Dt., A.P. ...Petitioners
Vs
1.Vemana Raja Babu, S/o.Not Known, 2nd Floor, Vamsiram Jyothi CELESTA, Plot No.66, Kavuri Hills, Jubilee Hills, Hyderabad-500033, Telangana.
2.Pulakhadam Madhava Ramesh, S/o.Not Known, C/o.Mitra Aqua Feeds and Needs, Near DTDC Courier, Besides Town Railway Station, Bhimavaram- 534201.
3.Sypu Subbayamma, W/o.Not Known, Near Sairam Theatre, Turputallu Centre, Turputallu-534280, W.G.Dt.
4.Pulaparthi Subba Rao, S/o.Not Known, Pulavarthivaripalem, Turputallu-534280, Mogalturu Mandal, W.G.Dt., A.P.
5.Ungarala Bhaskara Rao, S/o.Not Known, C/o.Sri Laxmi Prabha Aqua Feeds, Vemula deevi-534275, Mogalturu Mandal, W.G.Dt., A.P.
6.Kuralla Narasimha Rao (Chanti), S/o.Not Known, Near Lakshmi Vilas Bank, Turputallu-534280, Mogalturu Mandal, W.G.Dt., A.P.
7.Sattineni Varalakshmi, W/o.Rama krishna, Mollaparru Beach Road, Perupalem, Mogalthuru Mandal, W.G.Dt.
8.Melam Aswapathi, S/o.Not Known Melamvari Meraka, Perupalem-534281, Mogalturu Mandal, W.G.Dt., A.P.
9.Andey Narayana Rao, S/o.Not Known, C/o.Mangatayaru Aqua Feeds, Mollaparru Centre, Mollaparru, Perupalem-534281, Mogalturu Mandal, W.G.Dt., A.P.
10.Sunkara Ramesh, S/o.Not Known, C/o.Sri Vijaya Durga Feeds, Near High School Centre, Perupalem, Mogalturu Mandal, W.G.Dt.
11.Cherukuwada Ravikanth, S/o.Venkata Narasimha Rao, D.No.27A-2-4, Krishna Nagar, Palakollu-534260, W.G.Dt.,A.P.
12.Melam Srinivas, S/o.Not Known, Mollaparru Centre, Perupalem-534281, Mogaluru Mandal, W.G.Dt.
13.Smt.Adabala Ravallika, W/o.Venkanna, Near High School, Turputallu-534280, Mogalturu Mandal, W.G.Dt.
14.I.V.Ramalinga Raju, S/o.Not Known Prop:Redux Aqua Lab.Pippara, Ganapavaram Mandal, W.G.Dt.
15.The Official Receiver, W.G.Dt., District Court Complex, Eluru.
పై నంబరు పిటిషన్లో పిటిషనర్ Insolvent గా డిక్లేర్ చేసి రుణ విముక్తులను చేయగలందులకు పై నంబరు పిటిషన్ దాఖలు చేసినందున పైకోర్టు వారి ఎదుట **ది.06-08-2025 తేదీన ఉ.10.30లకు** వాయిదా అయి ఉన్నది. ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యడల కోర్టు వారి ఎదుట హాజరై తెలుపు కొనవలెను. మీరు స్వయంగా కానీ ప్లీడర్ ద్వారా కానీ పై కోర్టుకు హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో పిటిషన్ తీర్మానము చేయబడును అని ఇందు మూలముగా తెలియచెయ్యడము అయినది.
(కోర్టు ఆర్డర్ ప్రకారం)
చెల్లెం యేసురత్నం
అడ్వకేటు, పాలకొల్లు
నర్సాపురం
తేది.30-07-2025
సెల్: 9640639144